"నువ్వు ఎర్రగులాబీకన్నా అందంగా ఉన్నా"వని అన్నపూర్ణకి ఎవడో ఉత్తరం రాశాడు. కోపంతో ఆమె ముఖం గులాబీపువ్వులా ఎర్రబడింది. అంతా విని భర్త గోపాలం "అట్లాగా, వాడిసంగతి కనుక్కోవాలిసిందే" అని ఊరుకున్నాడు.

# పాలపొంగు

## వేదవతి

'గోపాళం!'

'............'

'ఓరిగోపాళమూ!'

'అబ్బ, ఏమిటి?'

......వీధి అరుగుమీద పీటం వేసుకూర్చున్న గోపాలం చిరాగ్గా పలికాడు.

"ఓరి, ఇక్కడ వుండేవట్రా పలకవు?...వీధి వాకిట్లోకి వచ్చి చూసి అన్నది తల్లి.

నిజానికి తల్లి పిలుపు గోపాలానికి వినిపించకపోలేదు. అతగాడికి ఎందుకో పలకాలనిపించలేదు. ఆ క్షణంలో తల్లేకాదు బ్రహ్మ దిగి వచ్చి పిలిచినా పలికేవాడు కాదు.

'ఏమిటేమిట్రా, అన్నానికిలే, మిల్లుకు పోను వేళయితేనూ।" అన్నది గోపాలం తల్లి రావుమ్మ.

'నాకు అన్నమూ వద్దు ఏమీవద్దు' ముక్తసరిగా అన్నాడు గోపాలం.

'మిల్లుకు పోవుట్రా? అన్నం యెందుకు తినవూ?' సాగదీసి అడిగింది రావుమ్మ.

'మిల్లుకు వేళయినప్పుడు వెళతాను. ఇక అన్నమా యీపూట తినను గాక తినను'... గోపాలం మరింత బిగదీపుగా అన్నాడు.

రావుమ్మ గొణుగుతూ లోపల గడపలో చతికిలబడింది. కోడలు కాపురానికి వచ్చి ఏడాదయింది ఇప్పటిదాకా యింట్లో ఏ కీచులాటా లేదు. ఇటు గోపాలానికి చెరుకు మిల్లులో పనీ, అటు కోడలుకు అగ్గిపెట్టెల ఫ్యాక్టరీలో పనీ. రెక్కలుగల పడుచువాళ్ళు, వాళ్ళిద్దరూ ఇంత తెస్తుంటే, తను ఇంతవంట చేసి ఇద్దరికీ పనివేళకు పెట్టి సంసారం గడుపుకొస్తూంది.

కోడలు తనకు ఆసెపిల్ల ముచ్చటతీర్చింది ఇంతవరకు తమ ఇద్దరకు యే పొరపూ లేదు. అటు వాళ్ళిద్దరూ ఒకరంటే ఒకరు ప్రాణాలు విడుస్తారు. వాళ్ళ సఖ్యత చూచి తనలో తనే మురిసిపోతుండేది కాదూ తనూ?

ఇవ్వాళ యేమిటో తెల్లవారి లేచిందగ్గర నుంచీ చిటచిటలాడుతూనే వున్నాయి యిద్దరి ముఖాలూనూ. అన్నపూర్ణ రోజూ ప్రొద్దున్నే స్నానంచేసి ఉతికిన చీరకట్టుకుని తిలదువ్వుకుని బొట్టూకాటుకా పెట్టుకుని తిండితిని పనిలోకి వెళ్ళేది. ఇవాళ అసేవిటో రోజూటి ముస్తాబూ లేదు. స్నానమన్నా చేయలేదు ఆఖరుకు భోజనమన్నా చేయలేదు. 'నాకాకలి లేదత్తా' అని చెప్పి పనిలోకి చక్కా వెళ్ళింది.

ఇటు వీడూ ప్రొద్దుటి నుంచీ ముణగదీసుకుని కూర్చున్నాడు. ఏమిటి చెప్మా వీళ్ళ కీచులాట? తను అడగటమెట్లాగూ? అడగక పోవటమెట్లాగూ? అయినా చిన్నవాళ్ళ కీచులాటల్లో తను కలిగించుకోకూడదు. ఇప్పుడు పోట్లాడుకుంటారు, మరి కాస్సేపటికి వాళ్ళే పకపకలాడుతారు.

మిల్లు మొదటికూత కూసింది గోపాలం చివాలున లేచి పైగుడ్డ సవరించుకుని మిల్లుకేసి బయలుదేరాడు.

రావుమ్మ మనస్సు చివుక్కుమంది. కన్నకొడుకూ, అటు పరాయిపిల్లా. చిన్నదీ - పస్తువుండి పనిలోకి వెళ్ళే తనకు మాత్రం తిండి యేమి సయిస్తుందీ? ఉసూరుమంటూ రావుమ్మ ఆపూట తాను అభోజనం వుండి మంచం పెట్టుకుని పడుకుంది.

సాయంత్రం వాడిన మొహంతో అన్నపూర్ణ యింటికి వచ్చింది. అత్తకు మామూలుగా వంటపనిలో సాయంచేసింది. పగలంతా ఫ్యాక్టరీలో జరిగిన వింతలూ విశేషాలూ రోజూ పకపకలాడుతూ చెప్పేది. ఇవాళ ఆవిడ నోరువిప్పలేదు

గోపాలం అయితే సరికి రోజూ ఇంటిముందు వాలేవాడు ఇవాళ ఏడు కావొస్తున్నా యింకా రాలేదు

రావుమ్మకు కొడుకు వైఖరీ కోడలివైఖరీ బొత్తిగా నచ్చలేదు. చిన్న చిన్న పేచీలు వస్తేమాత్రం యింత ఎడమొహమూ పెడమొహమూనా?

'ఏమిటే అబ్బాయి ఇంకా రాలేదు?' అని అడిగింది ఉండబట్టలేక.

'ఏమో నత్తా' అన్నది అన్నపూర్ణ ముభావంగా.

'ప్రొద్దునకూడా అన్నం తినకుండా వెళ్ళాడు. పరగడుపున పొద్దుగూకులూ పని యెట్లా చేశాడో యేమో, యింతవరకు యింటికే రాకపోయె!'...అన్నది రావుమ్మ.

అన్నపూర్ణ ఉలిక్కిపడింది. 'ప్రొద్దున భోజనం చేయకుండా వెళ్ళాడా! తనమీద కోపంవస్తేమటుకు అంత పంతమా! ఆ మిల్లులో పని అసలే బండపని. పస్తువుండి యెట్లా చేశాడో!'...అన్నపూర్ణ కళ్ళల్లో ముత్యాలంత నీటిబొట్లు నిలిచాయి

అన్నపూర్ణవి పెద్దపెద్ద కళ్ళు. ఆమె చామనచాయరంగులో, శరీరపు వొంపులో, వయసులోని మిసమిసలు మెలపులు తిరిగిపోయినాయి గచ్చకాయ లాడుకునే దినాల్లో నాలుగోతరగతి వరకూ చదువుకుంది. సన్నజాజికి పరిమళంవలె ఆసంస్కారలేశం ఆమెను పొదువుకున్నది.

రోజూ రాత్రిళ్ళు గుడ్డిదీపం ముందు పెట్టుకుని వారినడిగీ వీరినడిగీ తెచ్చుకున్న పత్రికలూ, చిన్న చిన్న పుస్తకాలూ గుణించుకుని చదువుకుంటూ తన నాలుగోతరగతి అక్షరజ్ఞానం మరచిపోకుండా పోషించుకుంటుండేది

ఇటీవల ఆ వ్యాసంగం మరికాస యెక్కువయింది. చేతికి వచ్చేవన్నీ మంచికథల పుస్తకాలే.

గోపాలానికి ఆ చదువుకూడా రాదు. అతనికి భార్య దీపంముందు పుస్తకం పట్టుకుని కూర్చుంటే సాక్షాత్తూ సరస్వతి తన యింటికి వచ్చినట్లుండేది అతడు బీడీ కాలుస్తూ ఆవిడ విద్యావ్యాసంగం పూర్తి కావటానికి నిరీక్షిస్తుండేవాడు.

ఈ మధ్యను వారం రోజుల్నుంచీ అన్నపూర్ణ కథల పిచ్చిలోపడి పది గంటలదాకా పుస్తకం వదలటం లేదు.

పగలంతా శరీర కష్టంచేసి వచ్చిన గోపా

# ★ పాలపొంగు ★

నికి భార్యతో ఆ కబురూ యీ కబురూ చెప్పుకోవాలనుంటుంది. వారం రోజుల్నించీ చూస్తున్నాడు, చూచి చూచి విసిగి తాను నిద్రపోతున్నాడు. ఆవిడ ఆ పుస్తకం వదిలిపెట్టి ఎప్పుడు పడుకుంటున్నదో అతనికి తెలియదు.

ఆ క్రితం రాత్రి ముచ్చట. మామూలు ప్రకారం ముగ్గురూ భోజనానికి కూర్చున్నారు. అన్నపూర్ణ చిటికెలో తిని కంచం కడిగి గదిలోకి వెళ్ళింది. తాపీగా భోజనం ముగించి బీడీ వెలిగించుకుంటూ గోపాలం లోపలికి వెళ్ళాడు.

దీపం ముందు పుస్తకం మీదకు వంగి అన్నపూర్ణ చదువుకుంటున్నది. అతగాడికి చిరాకు వేసింది.

“ఆ దీపం యివాళ్టికి తగ్గించి వేద్దూ, ఒకటే దోమలు పీకుతున్నాయి” అన్నాడు భార్య నుద్దేశించి.

ఆవిడ పలకలేదు. అసలతని మాటలు ఆమెకు వినిపించనే లేదు.

అతడికి కోపం వచ్చింది. దుడుకు రక్తం కూడానేమో, చివాలున లేచి ఆవిడ ముందున్న పుస్తకం తీసి ఒక మూలకు గిరవాటు పెట్టాడు.

అన్నపూర్ణ గబాలున లేచి “ఎందుకూ ఆ పుస్తకం తీసివేసింది?” అని కోపంగా అడిగింది.

“నా మాటలు కూడా వినపడకుండా చేస్తున్న పుస్తకాల్ని మూలకే తోస్తాను, తుంగలోకి తొక్కుతాను...మాటల్ని కఠినంగా నొక్కుతూ అన్నాడతను.

అతని మాటలు ఆవిడకు కోపం తెప్పించాయి. ముందూ వెనుకా ఆలోచించకుండా.

“అవును మరి, పుస్తకాల విలువయేమిటో తెలిస్తేగా!” అన్నది...

అతని ముఖం ఎఱ్ఱబడింది. అన్నపూర్ణ అనాలోచితంగా అన్న ఆమాట అతడి ఆత్మాభిమానం మీద పెద్ద దెబ్బ తీసింది.

గోపాలం యింకేమీ అనలేదు. దెబ్బ తిన్న పాములా ముంగిపోయి పక్కపైన ముసుగు తన్ని పడుకున్నాడు.

అన్నపూర్ణ దీపం ఆర్పేసి చాప పరుచుకుని యిటు తిరిగి పడుకున్నది. ఆ రాత్రి ఆ గదిలో అమావాస్య నాటి మేఘాలు ఆవరించాయి.

* * *

అన్నపూర్ణకు క్రితం రాత్రి జరిగిన సంగతి మెరుపులా కళ్లముందు మెరిసింది. ఇదివరకు చిన్న చిన్న పేచీలు వచ్చినా మరొక గంటలో ఎవరో ఒకరు పలకరించనిది ఉండగలిగేవారు కాదు. ఇవాళ అతడు యింత వరకు యింటికి రాలేదు. తెల్లవారి భోజనం చేయలేదు.

తను అనాలని ఆ మాట అనలేదు. చదువుతున్న పుస్తకం మొరటుగా లాగివేసేసరికి కోపంలో నోరుజారి అనేసింది. తన ఆమాట అతని అభిమానాన్ని ఎంత అవమానపరిచిందో అప్పుడు తెలియకపోయినా, యిప్పుడు బాగా గ్రహించింది. అందుకు పశ్చాత్తాపమూ పడింది.

ఎనిమిది దాటాక గోపాలం యింటికి వచ్చాడు. తల్లిని అన్నం పెట్టమన్నాడు.





57 ఏళ్లగా ఖ్యాతి గాంచినది.

వనితకు ఏ వయస్సైనా లోధ్ర మంచి పుష్టి నిచ్చే టానిక్. ఆరోగ్యానికి, ఆనందానికి లోధ్రను మించిన టానిక్ లేదు. కెమిస్టు లందరి వద్ద దొరుకుతుంది.

లోధ్ర స్త్రీల దివ్యౌషధం




కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్.
రాయపేట - మదరాసు - 14.

ఆంధ్ర రాష్ట్రము నకు ఏజెంట్లు:
సీతారామ్ జనరల్ స్టోర్సు, మెయిన్ రోడ్, విజయవాడ.

నాలుగు మెతుకులు తిని గదిలోకి వెళ్లి యించుమించు వెంటనే నిద్రకు పడ్డాడు.

అన్నపూర్ణ నివ్వెరపోయింది. అతడు అంతా మర్చిపోయి పలకరిస్తాడనీ, అలా జరక్కపోయినా తానైనా మాటాడుదామనీ అనుకున్నది. అతని యీ వైఖరికి ఆమె చిన్నబోయి ఆ రోజూ అలాగే చాప పరుచుకుని పడుకున్నది.

* * *

దినాలు గడుస్తున్నాయి. రావుమ్మకు వీళ్లకి తగాయిదా అంతు పట్టలేదు. అదీ చెప్పదూ, ఇటు వీడూ చెప్పడూ! అయినా యేమి పంతాలమ్మా యివి!

కోడలు గోపాలాన్ని చాలాసార్లు పలకరించబోవటమూ, వాడు వినిపించుకోనట్లు దూసుకుని పోవటమూ రావుమ్మ చాలాసారు చూచింది. కనక యిందులో కోడలి తప్పేమీ లేదని, గోపాలానికైనా అంత పంతం కూడదనీ అనుకున్న దావిడ.

ఇటు అన్నపూర్ణ చిక్కిపోతున్నది. అది నవ్వితే యిల్లంతా యేమిటో కలకలలాడినట్లుండేది. 'అత్తా, అత్తా' అంటూ పసిపిల్లలా చుట్టుకు చుట్టుకు తిరుగుతుండేది. ఇప్పుడు ఫ్యాక్టరీ నుంచి రాగానే దిగాలుగా ఒకమూల కూర్చుంటుంది. ఇన్నాళ్ళనయం, అక్కడా, యిక్కడా యేదో ఒక పుస్తకం తెచ్చుకుని చదివి 'ఈకథ విన్నావా అత్తా, అబ్బోమ్మ చూచావా అత్తా' అంటూ యెప్పుడూ యేదో ఒకటి వాగుతూనే వుండేది. ఇప్పటికి యెన్నాళ్ళ యిందో పుస్తకమనేది తెచ్చి చప్పిను. దాని ఆశంతా ఆకథల మీదే వుండేది.

'ఎందుకే యిట్లా వుంటున్నావు'...అని తను మరీ మరీ సాగదీసి అడిగితే వచ్చీరాని నవ్వు నవ్వి 'బాగానే వున్నాను కదమ్మా అత్తా' అంటుంది. అప్పటి దాని ముఖం చూస్తే తనకే ఏడుపు వచ్చినంత పనై అటు తిరిగి కళ్ళు తుడుచుకుంటుంది.

వాడు మాత్రం మునుపట్లా వుంటున్నాడా. సాయంత్రం అయిదు గంటలకు యింటికి వచ్చేవాడు. ఇప్పుడు రోజూ ఎనిమిదింటికి వస్తున్నాడు ఒక్కొక్క రోజు ప్రొద్దున కూడా యెక్కడికో వెళ్ళి వస్తుంటాడు' ఆదివారాలు, సరేసరి యింటి దగ్గర వుండే పనే లేదు. దానితో అసలే పలకడు అసలు దాని వంక చూస్తేనా? అది యింట్లో వుంటే తను వీధి అరుగుమీద ఆసనం వేసుకుని కూర్చుంటాడు.

ఈ కుంభకోణం యేమిటో తెలియక రావుమ్మ సతమతమయిపోతున్నది. వారిద్దరికీ మాటలు కలపాలని శతవిధాల ప్రయత్నించింది. వాడు బెల్లం కొట్టిన రాయిలా వున్నాడు కాని నోరు మెదిపితేనా?

రావుమ్మ రోజూ తెల్లవారి కొడుకువంక చూస్తుంది. కోడలువంక చూస్తుంది. వారి ముఖాలు ఆవిడకు సంతోష వార్త యేదీ చెప్పవు.

ఎప్పుడో గోపాలం ఒక ఎఱ్ఱగులాబి మొక్క తీసుకువచ్చి వాకిట్లో పాతాడు. రోజూ అది యెన్ని ఆకులు చిగిర్చిందీ లెక్కలు కడుతూ, దాని చుట్టూ తిరుగుతూ మహా ఆనందపడుతుండేవాడు. ఈ మాయదారి కీచులాట – 'అదేమిటో తనకు తెలియక పోయె – వచ్చిందగ్గరనుంచి దాని ముఖమే చూడటం లేదు.

అది యిప్పుడు మొగ్గ తొడిగింది. రోజా కొక ఎఱ్ఱగులాబీపువ్వు చెట్టున పూస్తున్నది.

అతగాడు ఆ పువ్వువంకన్నా ముఖమెత్తి చూడటంలేదు బతిమాలినా కోడలు ఆపువ్వు జడలో పెట్టుకోవటం లేదు.

* * *

పది నెలలు గడిచాయి. ఆ వేళ అన్నపూర్ణ తలంటుకుంది. సాయంత్రం వాకిట్లో తల ఆర్పుకుంటూ ఎఱ్ఱగులాబీ మొక్క పక్కన తిరుగుతూంది.

అన్నపూర్ణ వడిలిన మల్లెపువ్వులా వుంది. ఆమె కళ్లు మరీ పెద్దవిగా కనిపిస్తూ నీలాలు కారుతున్నట్లున్నాయి.

ఎవరో కుర్రవాడు పరిగెడుతూ అన్నపూర్ణ దగ్గరకు వచ్చాడు. ఒక చీటీ యిచ్చి 'ఆ వీధి చివరన నుంచున్నాయన మీకీ చీటీయిమ్మన్నా'డని చెప్పి మరి నిల్చోకుండా పరుగుతీశాడు.




రెండూ వాటర్‌ప్రూఫ్ వాచీలు—
రెండూ రోలెక్స తయారులు

మగవారికి ట్యూడర్ అయిస్టర్ వాచీ: ఈ వాచీయొక్క అసలైన ట్యూడర్ అయిస్టర్ కేసు. లోపల ఉన్న కచ్చితమైన 17 జ్యూయలల యంత్రమును దుమ్ము, మలినము మరియు నీళ్ల నుండి సురక్షితముగా ఉంచును.
ఆడవారికి: ప్రత్యేకమైన డిజైనులో యింకొక ట్యూడర్ అయిస్టర్ వాచీ. ఇయచే పనిగల స్త్రీలు యిది ఏళ్ల తరబడి పనిచేయుటను చూచి గర్విస్తారు. దీని సెకెండ్ల ముల్లు మధ్యలో ఉన్నది కనుక యీ వాచీ నర్సులకు ఎంతో ఉపయోగపడును.

మా అన్ని రకముల ట్యూడర్ వాచీలను చూచుటకు దయచేయండి. మీకు రావడానికి వీలు లేకపోతే మేము ఉచితముగ ఒక క్యాటలాగు పంపుతాము

ట్యూడర్

R. 4158
జెనీవా, స్విట్జర్లాండ్‌లో తయారైన వాచీలు

రోలెక్స వాచ్ కంపెని (ఈస్టర్న్) ప్రైవేట్ లిమిటెడ్ బొంబాయి.
ఆథరైజ్డ్ డిస్ట్రిబ్యూటర్లు:
పి. ఆర్. & సన్సు ప్రైవేట్ లిమిటెడ్, మౌంట్ రోడ్, మద్రాసు.

# ★ పాలపొంగు ★

అన్నపూర్ణ తలెత్తి చూసింది. ఆమెకు యెవరూ కనిపించలేదు. వణికే చేతుల్తో చీటీ విప్పింది.

రావమ్మకు యేదో వినిపించి వాకిట్లోకి వచ్చి తొంగిచూసి 'ఏమిటేఅది?' అన్నది.

పెదిమలు బిగబట్టి చదువుతున్న అన్నపూర్ణ ముఖం ఎఱ్ఱగులాబీ పువ్వయింది. చీటీ వలిపి వేలకు విసిరికొట్టి 'చూశావా అత్తా' అంటూ రావమ్మను కౌగలించుకుంది.

'ఎవరు రాశారే అది?' రావమ్మ కోడలి వెన్ను నిమురుతూ అడిగింది.

'ఎవరో నత్తా, నాకేం తెలుసూ, మీ అబ్బాయి పేరేనూ' అన్నది అన్నపూర్ణ.

'అడి జిమ్మడా, ఏమని రాశాడే' అన్నది రావమ్మ నోరు తెరుచుకుని.

'నా నోటితో ఎట్లా చెప్పను అత్తా, వాడికిటా నేను అందంగా వున్నానట. తలారబ్బుకుంటుంటే ఎక్కడినుంచో చూశాడట. చెట్టునున్న ఎఱ్ఱగులాబీ పువ్వుకన్నా అందంగా వేడికానట. వాడి దుంపతెగా యింకేమేమో రాశాడత్తా...' బావురుమంది అన్నపూర్ణ.

రావమ్మ రౌద్రమూర్తి అయింది. 'వాణ్ణి రానీ, ఆ వెధవ పని కనుక్కుందాం' అని కోడలికి ధైర్యం చెప్పింది.

ఎన్నడూ లేనిది ఆవేళ అయిదున్నరకే హుషారుగా యీలవేసుకుంటూ యింటికి వచ్చాడు గోపాలం.

'మాశాపుత్రా' వాకిట్లోనే యెదురై అన్నది రావమ్మ.

'ఏమిటి?'...కళ్లు చిట్లించి అడిగాడు.

రావమ్మ సాకూతంగా చీటీ సంగతి చెప్పి ఆ చీటీ రాసినవాణ్ణి నాలుగూ దులిపేసి ఆఖరుకు 'అడి జిమ్మడా' అని ఒక్క దీర్ఘం తీసి చతికిలబడింది.

అంతా విని గోపాలం 'అట్లాగా, వాడి సంగతి కనుక్కోవాలిసిందే' అని తాపీగా బావి దగ్గరకు వారి తీశాడు.

ఆ రాత్రి అన్నపూర్ణ వచ్చి చాప పరుచుకుని పడుకున్నాక గోపాలం యిటు తిరిగి వున్నట్లుండి యిలా అన్నాడు.

'చెట్టునున్న ఎఱ్ఱగులాబీకన్నా అందంగా వున్నావు.'

అన్నపూర్ణ ఉలిక్కిపడింది. ఆమెను భయమూ, ఆశ్చర్యమూ, ఆనందమూ వెంట వెంటనే ముసురుకున్నాయి. ఇదేవిమాట! ఉత్తరంలోమాట! ఈయనకేలా తెలుసు?

ఏదో మెరుపు మెరిసినట్లయి లేచికూచుని 'ఆ ఉత్తరం...' చటుక్కున అన్నది. అంతకుముందు పది నెలలనుంచీ తాము మాట్లాడుకోవటం లేదన్నమాట మరిచిపోయి.

గోపాలం నవ్వుతూ 'అవును. ఆ ఉత్తరం నేనే రాశాను. ఈ పదినెలల్లో చదవటం, రాయటం క్షుణ్ణంగా నేర్చుకున్నాను.' అన్నాడు.

అన్నపూర్ణ కళ్లు పెద్దవిచేసి 'నిజం?' అన్నది ఆశ్చర్యంగా. మరో క్షణంలో ఆకళ్లు నీళ్ళతో నిండిపోయాయి.

'ఆ నాడు అనుకోకుండా అన్నమాట మిమ్మల్ని యింత బాధ పెట్టిందా!' అన్నది.

'ఆ నాడు నీవు అనుకోకుండా అన్నమాటే నా చేత యింత పని చేయించింది ఖాళీ రాగానే చిన్న గుమాస్తాగా చేస్తానన్నాడు ఓనరుగారు.' అన్నపూర్ణకు చేయూతయిచ్చి చాప మీద నుంచి లేపుతూ అన్నాడు గోపాలం.

ఆ వేళ అర్ధరాత్రి వరకూ తన విద్యావ్యాసంగం ఎలా సాగిందీ అన్నపూర్ణకు చెపుతూ వాగినవాడు వాగినట్లే వున్నాడు గోపాలం. ఆరాత్రి వారి సమాగమం మధురమై తోచింది వారి యిద్దరికీ.

మర్నాడు గోపాలం ప్రొద్దెక్కే వరకూ లేవ లేదు.

'గోపాళం...'గదిలోకి వచ్చి పిలిచింది రావమ్మ.

'......'

'ఓరి గోపాలమూ...

'అబ్బ ఏవిటే'...బద్ధకంగా నవ్వుతూ అన్నాడు గోపాలం.

కొడుకు ముఖం చూచింది రావమ్మ. మరో క్షణంలో యింట్లోకి పరుగెత్తి కోడలి ముఖమూ చూచింది.

ఆమెకి అర్థమైంది ఆమెకు అర్థమైనది వారిద్దరి తగాయిదా యివ్వాళటికి పరిష్కారమైనదనే. అకీచులాట ఏవిటో అది యెట్లా పరిష్కారమైనదో యిప్పటికీ ఆవిడకు తెలియదు.

జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఆవిడ ఆ చీటీ రాసిన వాణ్ణి 'వాడి జిమ్మడా' అని తిడుతూనే వుంటుంది. ★


ఆ దగ్గును అణచండి-ఆ గొంతుపుండుకు ఉపశమనం కలిగించి మాన్పండి-రొమ్ము, శ్వాసకోశ బాధలను వెంటనే తొలగించండి




పెప్స్ సేవించండి.

PEPS

జగద్విఖ్యాతి గాంచిన

గొంతు, రొమ్ము టేబ్లెట్లు.

మందు లమ్మేవారి అందరివద్దా లభిస్తాయి.




పెప్స్ టేబ్లెట్లు గొంతు, రొమ్ము బాధోపశమన, నివారక సారములు కలవి. మీరు పెప్స్‌ను చప్పరించు నపుడు ఈ సారములు ఆవిరిఅయి, మీ శ్వాసద్వారా గొంతుకలోనికి, శ్వాసమార్గం, శ్వాసకోశాలలోనికి కొనిపోబడుతాయి. ఇలా అవి సరాసరి మిమ్ము బాధించే భాగాలను చేరుకుంటాయి. అందుకే పెప్స్ అంత శక్తివంతమై, జగద్విఖ్యాతి గాంచినవి. పెప్స్ దగ్గులను అణిచివేస్తాయి. గొంతుపుండు బాధను ఉపశమింపజేస్తాయి, కఫమును కోసివేసి, శ్వాసబాధను పోగొట్టుతాయి. ఇన్‌ఫ్లుయేంజా, బ్రోంకైటిస్ చికిత్సకు ఇవి అమోఘమైనవి.

మద్రాసు సోల్ ఏజంట్లు: మెసర్సు దాదా & కో., పార్కుటౌన్, మద్రాసు-3.